హౌసింగ్ ఇన్‌ఛార్జి పీడీగా సంగీత్ మాధుర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా గృహ నిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి పీడీగా ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్‌మాధుర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇన్‌ఛార్జి పీడీగా పని చేసిన డాక్టర్ ఆర్‌సి.ఆనంద్‌కుమార్ కృష్ణా జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒగా బదిలీ అయ్యారు. హౌసింగ్ పీడీగా బాధ్యతలు చేపట్టిన సంగీత్ మాధుర్‌కు ఆ శాఖ ఇఇ బి.వెంకటరమణ, డిఇలు జి.పిచ్చియ్య, పి.శివరామరాజు, సహాయ ఇంజనీర్లు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు

జగనన్న 'పద్దు' పలికేనా..!

పోలవరం నిర్వాసితుల హామీలకు నిధులొచ్చేనా

ముందుకు సాగని చింతలపూడి, తాడిపూడి సాగునీటి ప్రాజెక్టులు

పడకేసిన డెల్టా ఆధునికీకరణకు కేటాయింపులుండేనా

ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ప్రోత్సాహకాలు దక్కేనా

ఫిషింగ్ హార్బర్ అడుగులు ముందుకు పడేనా

కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం పరిస్థితేమిటో

దగ్గులూరు మెడికల్ కాలేజీ కాగితాలకే పరిమితమా

నేడు అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్

జగన్ సర్కార్ తన పదవీ కాలంలో చివరి బడ్జెట్‌ను బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. నాలుగున్నరేళ్లుగా జిల్లాకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులకుగాని, డెల్టా ఆధునికీకరణకుగాని, నిర్వాసితులకిచ్చిన హామీలకు నిధులు, ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ప్రోత్సాహకాలుగాని సరిగ్గా కేటాయించని పరిస్థితి నెలకొంది. దీంతో జిల్లా అభివృద్ధి పూర్తిగా పడకేసింది. చివరి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనైనా ఉమ్మడి జిల్లాకు నిధుల కేటాయింపు జరిగేనా అనే చర్చ సర్వత్రా సాగుతోంది. జగన్ పద్దు పలుకుతుందో.. లేదో మరో కొన్నిగంటల్లో తేలిపోనుంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వైసిపి సర్కార్ ఏర్పడి దాదాపు ఐదేళ్లు గడిచిపోయింది. ఇప్పటి వరకూ నాలుగు బడ్జెట్‌లను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. బుధవారం ప్రవేశపెట్టబోయే ఓటాన్ అక్కౌంట్ బడ్జెట్‌నే చివరి బడ్జెట్. ఎన్నికల అనంతరం కొలువుదీరిన ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. 2019 ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలుండగా 13 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలను వైసిపినే గెలుచుకుంది. అత్యధిక స్థానాలు కట్టబెట్టిన జిల్లాలో అభివృద్ధి పరుగులు తీస్తుందని జిల్లా ప్రజానీకం భావించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలుగాని, జిల్లాలోని అభివృద్ధి ప్రాజెక్టులకుగానీ, రైతులకు ఇచ్చే రాయితీలుగానీ ఏఒక్కటీ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేయలేదు. చివరి బడ్జెట్‌లోనైనా జిల్లాలోని ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు ఉండేనా అనే చర్చ నడుస్తోంది. జిల్లాలో అత్యంత ముఖ్యమైనవి చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్టులు. చింతలపూడి పూర్తయితే 4.60 లక్షల ఎకరాలకు, తాడిపూడి ప్రాజెక్టులో పిల్ల కాలువలు తవ్వితే 2.60 లక్షల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుంది. దశాబ్దాలు గడిచినా ఈ ప్రాజెక్టులు పూర్తికాని పరిస్థితి నెలకొంది. 2008లో చింతలపూడి ప్రాజెక్టును రూ.1,701 కోట్లు అంచనా వ్యయంతో ప్రారంభించారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును కృష్ణా జిల్లాకు విస్తరించి 4.80 లక్షల ఎకరాలకు సాగునీరందించే ప్రాజెక్టుగా మార్చింది. దీనికి రూ.4,909 కోట్లు ఖర్చు కానున్నట్లు ప్రణాళికలు రచించారు. ఇప్పటికీ భూసేకరణ ప్రక్రియ పూర్తి కాలేదు. గడిచిన బడ్జెట్‌లో రూ.272 కోట్లు కేటాయించినా చేసిన ఖర్చు నామమాత్రమే. ఇప్పుడు ఈ ప్రాజెక్టు ఖర్చు రూ.9,800 కోట్లకు చేరినట్లు అంచనాలు వేశారు. ఇప్పటి వరకూ నాలుగువేల కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఆ ఖర్చు కూడా గత ప్రభుత్వాల హయాంలోనే జరిగింది. ఈ బడ్జెట్‌లో కనీసం రూ.1500 కోట్లు కేటాయిస్తే పనులు ముందుకు సాగే పరిస్థితి ఉండనుంది. మరో ఎత్తిపోతల పథకం తాడిపూడి 2004లో ప్రారంభమైంది. ఇప్పటికీ పూర్తిస్థాయిలో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. పిల్లకాలువ తవ్వకాలు పూర్తిచేస్తే 2.60 లక్షల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందనుంది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.8,853 కోట్లు. ఇప్పటి వరకూ రూ.600 కోట్లు వరకూ ఖర్చు చేసిన పరిస్థితి ఉంది. మరో రూ.200 కోట్లు ఖర్చుపెడితే ప్రాజెక్టు పూర్తయ్యే పరిస్థితి ఉన్నా నిధులు కేటాయించడం లేదు. గత బడ్జెట్‌లో రూ.22 కోట్లు కేటాయించి మమ అనిపించారు. ఇక ఎర్రకాలువ రిజర్వాయర్, తమ్మిలేరు రిజర్వాయర్ పనులకు సంబంధించి నిధుల కేటాయింపు సరిగా లేదు. గత బడ్జెట్‌లో ఎర్రకాలువ ప్రాజెక్టుకు రూ.8.43 లక్షలు మాత్రమే కేటాయించారు.

పడకేసిన డెల్టా ఆధునికీకరణ

రెండు జిల్లాల్లోనూ ఖరీఫ్, రబీల్లో దాదాపు పది లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. 11 ప్రధాన కాలువలు, 300కుపైగా పిల్ల కాలువల ద్వారా సాగునీరు సరఫరా అవుతోంది. 2007లో డెల్టా ఆధునికీకరణకు అప్పటి ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు రూ.1416 కోట్లకు ఆమోద ముద్రవేసింది. గత ప్రభుత్వాల హయాంలో రూ.800 కోట్లు వరకూ ఖర్చు పెట్టారు. ఇంకా రూ.600 కోట్లు ఖర్చుచేస్తే డెల్టా ఆధునికీకరణ పూర్తి కానుంది. వైసిపి ప్రభుత్వం వచ్చాక డెల్టా ఆధునికరణ పనులను పూర్తిగా పక్కన పెట్టేసింది. గతేడాది బడ్జెట్‌లో కేవలం జిల్లాకు రూ.12 కోట్లు మాత్రమే కేటాయించారు. తూడు, గుర్రపుడెక్క వంటివి తీయడానికి కూడా నిధులు సరిపోని పరిస్థితి ఉంది. దీంతో వర్షాలకు ప్రతియేటా వేలాది ఎకరాల్లో పంట దెబ్బతింటుంది. రబీలో సాగునీటి ఎద్దడి సమస్య వెంటాడుతోంది. ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారో, లేదో వేచిచూడాలి.

పోలవరం నిర్వాసితుల హామీలకు నిధులొచ్చేనా

తాము అధికారంలోకి వస్తే పోలవరం నిర్వాసితులకు ఇస్తున్న రూ.6.25 లక్షల పునరావాస ప్యాకేజీని రూ.పది లక్షలకు పెంచుతామని, 2006కు ముందు సేకరించిన భూములకు ఎకరాకు రూ.ఐదు లక్షలు ఇస్తామని, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం ఇస్తామని, ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని, భూములకు భూములు అందిస్తామని వైసిపి చెప్పింది. నాలుగున్నరేళ్లు గడిచినా నిర్వాసితులకు పరిహారం అందించలేదు. ప్రాజెక్టులో కాపర్‌డ్యామ్ పూర్తి చేయడంతో ప్రతియేటా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 107 గ్రామాల్లో 20 వేల కుటుంబాలు గోదావరి వరద ముంపుబారిన పడి కొండలు, గుట్టలపై కాలం వెళ్లదీశాయి. గత ఆగస్టులో వచ్చిన వరదల సమయంలో కుక్కునూరు మండలం గొమ్ముగూడెం వచ్చిన సిఎం జగన్ 2024 జనవరి, ఫిబ్రవరి నెలల్లో హామీ ఇచ్చిన ప్రకారం పరిహారం అందిస్తామని ప్రకటించారు. ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తేనే అది సాధ్యమవుతుంది.

ఫిషింగ్ హార్బర్, కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం, దగ్గులూరు మెడికల్ కాలేజీలకు నిధులు దక్కేనా

నరసాపురం మండలం బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్, కొల్లేరులోకి సముద్రపు నీరు ప్రవేశించకుండా మూడు రెగ్యులేటర్ల నిర్మాణం చేపడతామని, పార్లమెంట్ స్థానం పరిధిలో మెడికల్ కాలేజీలో భాగంగా పాలకొల్లు మండలంలోని దగ్గులూరు వద్ద మెడికల్ కాలేజీ నిరిస్తామని ప్రకటించినా ఇప్పటి వరకూ పనులు ప్రారంభం కాలేదు. ప్రతి బడ్జెట్‌లోనూ నిధుల కేటాయింపులు లేకుండాపోయాయి. ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారా అనే చర్చ నడుస్తోంది. ఆక్వా యూనివర్సిటీని ప్రారంభించినా భవనాల నిర్మాణం మాత్రం జరగలేదు. పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తేనే వచ్చే ఏడాదికైనా సొంత భవనాల్లో ప్రారంభించుకునే అవకాశం ఉంటుంది.

ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ప్రోత్సాహకాలు లభించేనా

జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు, లక్షన్నర ఎకరాల్లో పామాయిల్, దాదాపు రెండు పంటల కింద పది లక్షల ఎకరాల్లో వరి సాగవుతున్నాయి. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీని కుదించడంతోపాటు మేత ధరలు పెరిగిపోవడం, రొయ్య ధర తగ్గిపోవడంతో ఆక్వా సాగు తీవ్ర ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ఆక్వా రైతులను ఆదుకునేలా ఎటువంటి ప్రోత్సాహకాలూ లేకుండా పోయాయి. పామాయిల్ రైతులదీ అదే పరిస్థితి. వరి రైతులకు బోనస్ వంటివి ఇవ్వడంలో ఎటువంటి చర్యలూ లేకుండా పోయాయి. ముఖ్యంగా వైసిపి ప్రభుత్వంలో కౌలురైతుల పరిస్థితి మరింత దిగజారింది.

డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

యూనియన్ జిల్లా అధ్యక్షులు మదీనాబీబీ

సమస్యలు పరిష్కరించాలని డిఇఒకు వినతి

ప్రజాశక్తి - భీమవరం

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజనం కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని మధ్యాహ్న భోజనం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు మదీనాబీబీ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో డిఇఒ ఆర్.వెంకటరమణకు మధ్యాహ్న భోజనం కార్మికులు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మదీనాబీబీ మాట్లాడుతూ రోజురోజుకీ నిత్యావసరాల ధరలు, విద్యుత్ ఛార్జీలు, పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు పెరగడంతో మధ్యాహ్న భోజనం కార్మికులకు ఇచ్చే రూ.3 వేలు సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలు చేయాలని, మెనూఛార్జీలు రూ.20 పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, యూనిఫారం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో వి.కుమారి, బి.రాజేశ్వరి, బి.మాధవి పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యతివ్వాలి

జాయింట్ కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

మాట్లాడుతున్న జెసి రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

రైతుల ప్రయోజనాలకు అధికారులు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైసుమిల్లుల నుండి రైతుభరోసా కేంద్రానికి పంపాల్సిన గోనె సంచులు, రైతులకు ఇవ్వాల్సిన గోనె సంచులు, ఆర్‌బికెల్లో గోనె సంచుల నిల్వలపై సంబంధిత అధికారులతో జెసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైసుమిల్లర్ల ద్వారా ఎన్ని గోనె సంచులొచ్చాయి, ఎన్ని వినియోగించారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోనె సంచులు పెండింగు లేకుండా చూడాలని, ఏఒక్క రైతూ ఫిర్యాదు చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని అన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, డిఎస్ఒ ఎన్.సరోజ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, ఎఎస్ఒ ఎం.రవిశంకర్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం ఆందోళన

తహశీల్దార్‌కు వినతిపత్రం చేస్తున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు

ప్రజాశక్తి - మొగల్తూరు

రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొగల్తూరు పంచాయతీ పరిధి గొల్లగూడెంలో సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మొగల్తూరు గాంధీబొమ్మ సెంటర్ ప్రాంతం నుండి వెంప వరకు రహదారి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలన్నారు. మొగల్తూరు నుండి పలువురు ఈ రహదారిపై భీమవరంలో ఉపాధి నిమిత్తం రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ఈ రోడ్డు దారుణంగా దెబ్బతినడంతో వారంతా తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ప్రదర్శనగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్ బిఎస్ఆర్.భాస్కర్‌కు వినతపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు యడ్ల చిట్టిబాబు, కొత్తపల్లి నాగరాజు, వీర పాండురంగారావు, ఆదూరి సాంబమూర్తి, కొల్లాటి బాబూరావు, చిలకలపూడి నాగేశ్వరరావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

8న ఆశా వర్కర్ల ధర్నాను విజయవంతం చేయాలి

భీమవరం రూరల్‌లో..

పజాశక్తి - మొగల్తూరు

ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మొగల్తూరులోని పిహెచ్‌సి వద్ద మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు నిరసన ప్రదర్శన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆశా వర్కర్లకు కనీసం వేతనం చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌ను ఆశలూగా మార్చాలని అన్నారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్‌లు అమలు చేయాలన్నారు. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, 62 సంవత్సరాలు దాటిన రిటైర్మెంట్ జిఒ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వీరవాసరం : ఆశా వర్కర్లకు వేతనంతో కూడిన సెలవులివ్వాలని, పని ఒత్తిడి తగ్గించి, వేధింపులను అరికట్టాలని ఈ నెల 8వ తేదీన విజయవాడలో జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు విజ్ఞప్తిచేశారు. మంగళవారం వీరవాసరం, కొణితివాడ పిహెచ్‌సి వద్ద ఆంజనేయులు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సూచనలు సలహాలు ఇస్తూ అర్ధరాత్రి అనేది లేకుండా ప్రసవం కేసులను హాస్పటల్‌కు తీసుకెళ్లి ప్రజలకు అనేక సేవలందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనాలతో పాటు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణం సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఎనిమిదో తేదీ ధర్నా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 8వ తేదీన చలో విజయవాడలో జరిగే ధర్నాను ఆశా వర్కర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు దీపిక విమల కుమారి పిలుపునిచ్చారు. మంగళవారం ఆశా డే సందర్భంగా తుందుర్రు పిహెచ్‌సిలో మెడికల్ ఆఫీసర్ డి.దయామణికి, గొల్లవానితిప్ప పిహెచ్ యు టిసి చంద్ర మురళీకి ఆశా వర్కర్లు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు దీపిక విమల కుమారి మాట్లాడారు. 8వ తేదీన విజయవాడలో ధర్నా చౌక్‌లో జరిగే రాష్ట్ర ధర్నా లో ఆశా వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి రూతు శాంతకుమారి, చిట్టి మేరి, పి.ఉషాకుమారి పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడాలి

మాజీ మంత్రి పితాని సత్యనారాయణ



వృద్ధురాలితో మాట్లాడుతున్న పితాని

ప్రజాశక్తి - పోడూరు

ప్రజా వ్యతిరేక వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం 'ప్రజల వద్దకు పితాని' పాదయాత్రలో భాగంగా మండలంలోని మినిమించిలిపాడు వద్ద పాదయాత్ర ప్రారంభించారు. గ్రామాల్లో సమస్యలను ప్రజలు ఆయనకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ ఇంకో రెండు నెలలు ఓపిక పడితే తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం వస్తుందని, దానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉందని ఆయన అన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా స్థానిక ఎంఎల్ఎకు ప్రజలు గుర్తు రాలేదని, ఎన్నికల దగ్గరకొచ్చేసరికి డ్వాక్రా మహిళలకు చీరలు, భోజనాలు పెట్టి మరోసారి మోసగించడానికి సిద్ధమయ్యారని విమర్శించారు. ఈ పాదయాత్ర మినిమించిలిపాడు, పండితవిల్లూరు గ్రామాల మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీల మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, రావి హరీష్‌బాబు, ఆచంట ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి, రుద్రరాజు రవి రాజు, బొక్కా. నాగేశ్వరరావు, నేతలు పాల్గొన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

మినిమించిలిపాడు పంచాయతీ పరిధిలోని వెన్నపువారిపాలెం నుండి సుమారు 30 మంది దళిత యువత పితాని సమక్షంలో టిడిపిలో చేరారు.

క్రీడాకారులు జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలి

జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

'ఆడుదాం.. ఆంధ్రా' రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని క్రీడాకారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో 'ఆడుదాం.. ఆంధ్రా' రాష్ట్రస్థాయి పోటీలపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో జెసి మాట్లాడారు. రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుండి వెళ్లే క్రీడాకారులకు ముందస్తుగా ఏర్పాట్లను సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా నుండి పది జట్లు రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు ఎంపికయ్యాయన్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, కోకో క్రీడలకు పురుషుల నుండి ఐదు టీములు, మహిళల నుండి ఐదు టీములు మొత్తం 114 మంది క్రీడాకారులు ఈ నెల 9న విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా నుండి విశాఖపట్నం వెళ్లే క్రీడాకారులకు అవసరమైన రవాణా సౌకర్యం నిమిత్తం బస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బస్సులు 8వ తేదీ ఉదయం ఉండి, భీమవరం, నరసాపురం నుండి బయల్దేరేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డిఒ ఎం.రాజేష్, చీఫ్ కోచ్ డాక్టర్ ఎం.దుర్గారావు, డిప్యూటీ తహశీల్దార్ గ్రంధి పవన్, వివిధ క్రీడలకు సంబంధించిన టీమ్ లీడర్లు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

మాట్లాడుతున్న బి.వాసుదేవరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అపరాల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) 38వ వార్షికోత్సవం, యూనియన్ మాజీ అధ్యక్షులు వర్రి అప్పల సత్యం సంతాప సభ మంగళవారం చుక్కా అప్పలస్వామి భవనం ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో గొన్నాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా అపరాల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గొన్నాబత్తుల నాగేశ్వరరావు సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సభా ప్రాంగణానికి వర్రి అప్పల సత్యం ప్రాంగణంగా నామకరణం చేశారు. ముందుగా వర్రి అప్పల సత్యం చిత్రపటానికి కర్రి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 2023వ సంవత్సరం కార్యకలాపాల రిపోర్టును యూనియన్ గౌరవాధ్యక్షులు కరెడ్ల రామకృష్ణ ప్రవేశపెట్టారు. యూనియన్ సభ్యులు రిపోర్టును ఆమోదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవర, కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు, ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, పెంటపాడు మండల కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ దేశంలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 40 కోట్ల మంది కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాడ్యూటీ, ఇన్సూరెన్స్ అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా విభజించడం దుర్మార్గమన్నారు. బిజెపికి మద్దతు తెలిపే పార్టీలను ఓడించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కరెడ్ల రామకృష్ణ, అధ్యక్షులుగా గొన్నాబత్తు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా అయినాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా నర్మాల నారాయణరావు, కోశాధికారిగా అగుర్తుల రామోహనరావు, కమిటీ సభ్యులుగా దాసరి రాజు, సుందరపు అప్పలనాయుడు, రావి శ్రీనివాసరావు, నీరుకొండ రమణ, ఇల్ల గోవిందరావు, బద్ది నాగేశ్వరరావు, పెంటకోట గోవిందు, చిట్టేటి సత్యనారాయణ, బుద్దాల తాతారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ, సత్తి కోదండరామిరెడ్డి, చల్లా చంద్రరావు, జవ్వాది శ్రీను, నరమాల కృష్ణ, మెట్రెడ్డి రమణ, కుంచంగి నానాజీ, గొర్రెల సతీష్ కుమార్, పులిమంతుల రమణ, సిరపరపు రామారావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పరిపుష్టి చెందాలి

ప్రజాశక్తి - ఆచంట

డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు ఆసరా కార్యక్రమం ద్వారా ఆర్థిక పరిపుష్టి పొందాలని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రంగనాథ రాజు అన్నారు. తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎనిమిదో రోజు మనసారా ఆసరా సంబరాల్లో ఆయన మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం సభలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ స్థాయిలో 13,500 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత వైసీపీకి దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఆరోపణ చేయడం హేయమైన చర్య అన్నారు. పేదలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రిని అత్యధిక మెజార్టీటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డి, డ్వాక్రా అక్క చెల్లెమ్మలు పాల్గొన్నారు.

మొగల్తూరు తహశీల్దార్‌గా భాస్కర్

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు మండల తహశీల్దార్‌గా బివిఎస్‌ఆర్.భాస్కర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన జి.అనితాకుమారి ఎన్నికల విధుల్లో భాగంగా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మల్కిపురానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో భాస్కర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. భాస్కర్‌ను డిటి నరేష్ రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

ఆర్‌టిసి సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం

ఆర్‌టిసి సేవలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ విజయవాడ జోనల్ ఛైర్మన్ పిన్నింటి మహేష్ అన్నారు. సోమవారం రాత్రి ఛైర్మన్ మహేష్, ఇన్‌ఛార్జి డిపో మేనేజర్ పి.సత్యనారాయణ మూర్తి జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ నరసాపురం నుంచి మొగల్తూరు, పట్టిపాలెం, బియ్యపుతిప్ప, మచిలీపట్నం మీదుగా హైదరాబాద్ సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు నడుస్తుందన్నారు. సర్వీసు రాత్రి 8 గంటలు నరసాపురం నుండి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు బిహెచ్‌ఇఎల్ చేరుకుంటుందన్నారు. తిరిగి రాత్రి బిహెచ్‌ఇఎల్‌లో బయలుదేరి ఉదయం 6.45 గంటలకు నరసాపురం చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ టి.ధనలక్ష్మి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే సిఎం లక్ష్యం : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. మంగళవారం ఉండిలో రూ.30 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు నరసింహరాజు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నియోజకవర్గంలో సుమారు రూ.100 కోట్లు రూపాయల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇటీవల కలెక్టర్ ద్వారా సుమారు కోటి 50 లక్షల రూపాయలతో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన ఆర్‌టిసి ఆర్‌ఎం వీరయ్యచౌదరి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్లను జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎం.ఎ.వీరయ్య చౌదరి మంగళవారం ఎస్‌పి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలోని ఆర్‌టిసి డిపోలు, ఆర్‌టిసి నడుపుచున్న సర్వీసుల గురించి వివరించారు, ఆర్‌టిసి ఆదాయానికి గండి కొడుతున్న ప్రయివేటు వాహనాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఆర్‌టిసి, పోలీస్ అధికారుల ఉమ్మడి ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలకు సహకరించాలని కోరారు. ఎస్‌పి సానుకూలంగా స్పందించి తగు ఆదేశాలిచ్చేందుకు అంగీకరించారని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ పిఎన్‌విఎంఎస్.మూర్తి, షెడ్యూల్ సెల్ ఇన్‌ఛార్జి ఆర్.బాలసుబ్రహ్మణ్యం, పిఆర్‌ఒ రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

డిజిటల్ విద్య కోసం 8వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు కోరారు. కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేసి మాట్లాడారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పిల్లగోళ్ల శ్రీలక్ష్మి, ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనారాయణ, మండల రామ్‌కుమార్ రాజు, ప్రధానోపాధ్యాయిని నిర్మలాదేవి, దంతులూరి కోటిరాజు, వేగేశ్న రామరాజు పాల్గొన్నారు.

వైఎన్‌లో సదస్సు

ప్రజాశక్తి - నరసాపురం

వైఎన్ కళాశాల పీజీ సెమినార్ హాల్లో మంగళవారం ఓరియంటేషన్ ఆన్ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ (గ్రూప్) అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సును విశాఖపట్నం లోని ఆంధ్ర యూనివర్శిటీకి చెందిన ఉన్నత్ భారత్ అభియాన్ రీజనల్ కోఆర్డినేటర్ బి.పావని ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఆమె మాట్లాడారు. 'గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధించడమే ఉన్నత్ భారత్ అభియాన్ ముఖ్య ఉద్దేశం' అన్నారు. వైఎన్ కళాశాల డీన్ గంధం రామకృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.యాకోబ్‌కు, బిఎడ్ కళాశాల ప్రిన్సిపల్ పి.శాంతికి ఉన్నత్ భారత్ అభియాన్ ద్వారా ప్రాజెక్టు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమం నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ జి.నాగరాజు వ్యవహరించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, పిజి డైరెక్టర్ ఎన్.చింతారావు, కళాశాల డీన్ గంధం రామకృష్ణ పాల్గొన్నారు.

త్వరలో బిసి ఐక్యతా భవనం నిర్మిస్తాం : బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా త్వరలో బిసి ఐక్యతా భవనాన్ని నిర్మిస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బొలిశెట్టి ఆఫీసు కార్యాలయ ప్రాంగణంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా నాయకులు విశ్వబ్రహ్మ శాఖ అధ్యక్షత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల కాలంలో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి నిధులు కేటాయించకుండా బిసిలను వైసిపి ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు అత్తిలి బాబి, కె.విజయ్, మల్లేశ్వరరావు, లోవరాజు, మట్టా రామకృష్ణ, మధుబాల, జనసేన పాల్గొన్నారు.

మొగల్తూరు : పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తామని జనసేన నర్సాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ అన్నారు. కెపిపాలెంసౌత్ గ్రామానికి చెందిన గన్నాబత్తుల వెంకటేశ్వరరావు, కందులపాటి రాధాకృష్ణ వారి అనుచరులు సుమారు 20 మంది, మెట్టిరేవు గ్రామానికి చెందిన బిలకలపూడి ప్రసాద్, బొడ్డు బాలు తదితరులు సుమారు 50 మంది మంగళవారం నాయకర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో బొమ్మిడి సునీల్, గంటా కృష్ణ, ఉప్పులూరి రాంబాబు, కందులపాటి రామకృష్ణ, బొడ్డు త్రిమూర్తులు, ఆండ్ర రంగబాబు ఉన్నారు.

డిపిఒగా విక్టర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా పంచాయతీ అధికారిగా ఆర్.విక్టర్ బాధ్యతలు చేపట్టారు. కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాద పూర్వకంగా కలిశారు. కాకినాడ డిపిఒగా పనిచేస్తూ బదిలీపై విక్టర్ ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ పనిచేసిన జివికె మల్లికార్జునరావు బదిలీపై అంబేద్కర్ కోనసీమ జిల్లాకు డ్వామా పిడిగా బదిలీపై వెళ్లారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కాళ్ల

దొడ్డనపూడి గ్రామ పరిధిలో సచివాలయం-2లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పథకం నిధులు రూ.20 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ అధ్యక్షులు గుండా సాయిబాబా, కొల్లి రామకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కాళ్ల: గ్రామాభివృద్ధి కోసం సిమెంట్ డ్రైనేజీ, రోడ్ల నిర్మాణ పనులకు వైసిపి ప్రభుత్వం కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, శంకుస్థాపనలు ముమ్మరంగా చేస్తున్నామని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. జక్కరంలో పివిఎల్ నరసింహరాజు పలు అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. జెడ్‌పి నిధులను రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు) ద్వారా రూ.50 లక్షలు మంజూరయ్యాయి. అరుంధతి పేట, జక్కరం చిన్నపేట, జక్కరం కాలనీ, సుభాష్ నగర్ లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కూచంపూడి పద్మావతి, ఉప సర్పంచి కూచంపూడి లక్ష్మీపతిరాజు, జెడ్‌పిటిసి పి.సోమేశ్వరరావు, కాళ్ల ఎంపిపి శిరీష విశ్వనారాయణ పాల్గొన్నారు.

తణుకు ఎంపిడిఒగా శ్రీలలిత

తణుకు రూరల్: తణుకు మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపిడిఒగా డి.శ్రీలలిత మంగళవారం విధుల్లో చేరారు. శ్రీలలిత తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట మండల ఎంపిడిఒగా పనిచేస్తూ బదిలీపై తణుకు వచ్చారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మహిళా పక్షపాతి జగన్ : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

మహిళా పక్షపాతి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. మంగళవారం ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పివిఎల్.నరసింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్మన్, ఉండి నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు వేశారని కొనియాడారు. ఆయనకు అక్క చెల్లెమ్మల ఆశీస్సులు ఉండాలన్నారు. 99 శాతం హామీలు నెరవేర్చి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాడన్నారు. మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉండి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న పివిఎల్ నరసింహరాజుకు ప్రజలకు అండగా నిలబడాలన్నారు. మండలంలో 1,257 గ్రూపులకు సంబంధించి 12,586 మంది మహిళలకు 15,30,31,226 రూపాయల చెక్కును పంపిణీ చేశారు. అనంతరం డ్వాక్రా మహిళలచే జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, జెడ్‌పిటిసి రణస్థుల కనకదుర్గ మహంకాళి, ఎఎంసి ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర జానపద సృజనాత్మక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ కొర్రపాటి అనిత పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న పివిఎల్

అధికారుల నిర్లక్ష్యంతో లబ్ధిదారుల అవస్థలు

జెసి రామ్‌సుందర్‌రెడ్డికి వినతి

ప్రజాశక్తి - పాలకోడేరు

అధికారుల నిర్లక్ష్యంతో జగనన్న కాలనీ లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ అన్నారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం జెసి రామ్ సుందర్ రెడ్డికి గొరగనమూడి జగనన్న లేఔట్‌కు సంబంధించి సమస్యలపై వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గొరగనమూడి జగనన్న కాలనీలో 198 మందికి పట్టాలు మంజూరు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారన్నారు. సర్వే నెంబర్ 98లో డీ పట్టా భూమి 4 ఎకరాల 92 సెంట్ల స్థలం రైతుల నుంచి తీసుకుని వారికి డబ్బులు చెల్లించకుండా అధికారులు కాలయాపన చేశారన్నారు. సెంటున్నర చొప్పున పట్టాలు పంపిణీ చేసి లబ్ధిదారులకు భూమిని స్వాధీనం చేయలేదన్నారు. ఎన్ని సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. అధికారులు స్పందించి వెంటనే రైతులకు నష్టపరిహారం, లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు.

జెసికి వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

పివిఎల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపిడిఒ అనూహ్య

పాలకోడేరు ఎంపిడిఒగా అనూహ్య

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా టి.అనూహ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కృష్ణా జిల్లా ఘంటసాల మండలం నుంచి పాలకోడేరు ఎంపిడిఒగా అనూహ్య బదిలీపై వచ్చారు. రెండు నెలల క్రితం కృష్ణా జిల్లా ఘంటసాల మండలంలో ఎంపిడిఒగా చేరి ఎన్నికల్లో భాగంగా బదిలీపై ఇక్కడకు వచ్చారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు)ను ఎంపిడిఒ అనూహ్య, తహశీల్దార కె.నాగార్జున మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారి వెంట డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణ రాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగభూషణం నాయుడు ఉన్నారు.

డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

డ్రెయినేజీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పాతూరులో జరుగుతున్న డ్రెయినేజీ పనులను మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ మంగళవారం పరిశీలించారు. వార్డుల పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన పాతూరులో రైల్వే ట్రాక్‌ను ఆనుకుని జరుగుతున్న డ్రెయినేజీ పనులను పరిశీలించారు. ఎగువ నుంచి వచ్చే మురుగునీరు మొత్తం దిగువకు ప్రవహించేలా డ్రెయినేజీలో పూడికను తీయడంతో పాటు వెడల్పు చేయాలని కమిషనర్ శామ్యూల్ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కరరావు, అసిస్టెంట్ కమిషనర్ గోపాల్ రావు పాల్గొన్నారు.

వేడంగిపాలెం సొసైటీ ఛైర్మన్‌గా గణపతిరాజు

ప్రజాశక్తి - పోడూరు

వేడంగిపాలెం సొసైటీ ఛైర్మన్‌గా వైసిపి నాయకులు కలిదిండి గణపతిరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు మరిన్ని సేవలందించేందుకు, సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సొసైటీ ఛైర్మన్‌గా తనను నియమించడం పట్ల వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపికి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులుగా ఆకుమర్తి సుగుణరావు, గుడాల సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేశారు. సొసైటీ ఛైర్మన్ గణపతి రాజుకు, సభ్యులు సుగుణరావు, సత్యనారాయణకు జెసిఎస్ కన్వీనర్ బల్ల రాజశేఖర్, ఇళ్ల నాగార్జున, సొసైటీ మాజీ ఛైర్మన్ కొట్టు రాము, దేవస్థానం ఛైర్మన్ కొట్టు నాని తదితరులు అభినందనలు తెలిపారు.

సొసైటీని మరింత అభివృద్ధి చేస్తా

ఛైర్మన్ అప్పాజీ

ప్రజాశక్తి - పోడూరు

అభివృద్ధి పథంలో నడుస్తున్న జిన్నూరు కోపరేటివ్ సొసైటీని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని జిన్నూరు కోపరేటివ్ సొసైటీ నూతన ఛైర్మన్ జక్కంశెట్టి అప్పాజీ అన్నారు. జిన్నూరు కోపరేటివ్ సొసైటీకి ఛైర్మన్‌గా నియమితులైన అప్పాజీ మంగళవారం సొసైటీ కార్యాలయం వద్ద ప్రమాణస్వీకారం చేశారు. సొసైటీ మాజీ అధ్యక్షులు డిటిడిసి బాబు, పి.రామ కృష్ణంరాజు, పి.సుబ్బరాజు, సర్పంచి జమ్ము బేబీ మహాలక్ష్మి, మృత్యుంజయరావు అప్పాజీని సత్కరించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పెచ్చెట్టి ముత్యాలరావు, గోగులమండ విజయదేవి, నాయకులు దాసరి చెల్లాయమ్మ, కనకరాజు, పితాని కనకదుర్గా రెడ్డి, అంజిబాబు పాల్గొన్నారు.

అందరికీ లయన్స్ సేవలు అందాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అంతర్జాతీయ లయన్స్ క్లబ్ సేవలు అందరికీ అందాలని రీజయన్ ఛైర్మన్ లయన్ మదన్ మోహన్ అగర్వాల్ అన్నారు. తాడేపల్లిగూడెం డైమండ్స్, క్రైండ్‌నెస్ అభయం, వశిష్ఠ లయన్స్ క్లబ్ అధికారిక పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం పలు సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కై డెంటల్ హాస్పటల్ వారిచే ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించి మౌత్ వాష్‌లు, పేస్ట్‌లు అందజేశారు. రీజయన్ కార్యదర్శి సన్నిధి సూర్యనారాయణ మూర్తి, జోన్ ఛైర్మన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హేమసుందర్, మండే మాధురి, చిక్కాల భ్రమరాంబిక, క్రైండ్ నెస్ అభయం లియో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పెనుగొండ ఎస్ఐగా షేక్ సుభాని

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా షేక్ సుభాని మంగళవారం విధుల్లో చేరారు. గతంలో సమిశ్రగూడెం ఎస్ఐగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

కొవ్వలి ఫౌండేషన్ ఆధర్యాన 10న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని తెలగా కళ్యాణ మండపంలో కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏడో వార్డులోని ఆయన స్వగృహంలో కొవ్వలి ఫౌండేషన్ మెగా జాబ్ మేళా కరపత్రాన్ని కొవ్వలి రామ్మోహన్ నాయుడు ఆవిష్కరించి మాట్లాడారు. తెలగా కళ్యాణ మండపంలో ఈ నెల 10వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. 50కి పైగా బహుళ జాతి కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొని వివిధ ఉద్యోగావకాశాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఇప్పటికే సుమారు 3 వేల మంది అభ్యర్థులు కొవ్వలి మెగా జాబ్ మేళాకు దరఖాస్తులు చేసుకున్నారని, మరో 2500 మంది అభ్యర్థుల నుంచి దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామ్మోహన్ నాయుడు సూచించారు. ఈ జాబ్ మేళా ప్రోగ్రాం కన్వీనర్ గా సిహెచ్ కాశీ విశాలాక్షి వ్యవహరిస్తారని అన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9849304430ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ముస్కుడి రవి, మండా రామకృష్ణ, సంకు భాస్కర నాయుడు, బర్రె మురళీ, సత్తినేని శ్రీనివాస్, రేవు పద్మారావు, చెల్లబోయిన వాసు, మల్లాడి మూర్తి, వెంద్ర వెంకట నారాయణ, వడ్డీ అకేష్ ఉన్నారు.

నూరుశాతం ఫలితాలే లక్ష్యంగా శిక్షణ

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలో పదో తరగతి విద్యార్థులకు నూరుశాతం ఫలితాలు లక్ష్యంగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ఎంఇఒ ఎ.రవీంద్ర, ఎంఇఒ-2 సీతారామయ్య తెలిపారు. మండలంలో ఎనిమిది ప్రభుత్వ హైస్కూళ్లలో మొత్తం 534 మంది విద్యార్థులు 10వ తరగతి చదువుతున్నారన్నారు. వారికి ప్రత్యేకంగా అదనపు తరగతులు, వారాంతపు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. వారిలో సి, డి గ్రేడ్లకు చెందిన విద్యార్థులను ప్రత్యేకంగా దత్త తీసుకుని ప్రత్యేకంగా ఉపాధ్యాయులతో అదనపు తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజూ ఉదయం 8:30 నుండి 9:00 వరకు అరగంటసేపు, నాలుగు నుండి ఐదు గంటల వరకూ సాయంత్రం గంటసేపు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నామన్నారు.

తరగతులను పరిశీలిస్తున్న ఎంఇఒ రవీంద్ర

సీనియర్ పాత్రికేయులకు పెన్షన్

ప్రజాశక్తి - పాలకొల్లు

62 సంవత్సరాలు దాటిన సీనియర్ పాత్రికేయులకు ప్రతి నెలా వెయ్యి రూపాయలు చొప్పున పింఛను ఇచ్చేందుకు పాలకొల్లు ప్రెస్‌క్లబ్ నిర్ణయించింది. స్థానిక ప్రెస్‌క్లబ్ భవనంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకటరమణ అధ్యక్షత వహించారు. తొలిగా సీనియర్ పాత్రికేయుడు వీరా సత్యంకు అందజేస్తూ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మరో రూ.వెయ్యిని ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు విన్నకోట వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వెంకట రమణ అందించారు. క్లబ్ అభివృద్ధితోపాటు సభ్యుల సంక్షేమం దిశగా కొత్త కమిటీ పని చేస్తోందని చెప్పారు. త్వరలో ప్రెస్ క్లబ్ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు సమావేశం తీర్మానించింది. ఐజెయు సభ్యులు ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘం భవన విస్తరణతో పాటు సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరుపుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ ఉపాధ్యక్షులుగా బివివి సత్యనారాయణ, కె.శాంతారామ్, సహాయ కార్యదర్శిగా రాపాక రవిబాబు, ఇసి మెంబర్‌గా తాళ్ల రాఘవ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో చిన్న పత్రికల సంఘం అధ్యక్షుడు కాగిత సూర్యనారాయణ, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పిటి వెంకటేశ్వరరావు, మండెల అప్పలరాజు, జి.ఉదయ్ భాస్కర్ , కూనపురెడ్డి చిన్ని పాల్గొన్నారు.

చింతపర్రులో జగనన్న సురక్ష వైద్య శిబిరం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు పిహెచ్‌సి పరిధిలో చింతపర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాను నాయక్ మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకుని బిపి, షుగర్ ఇతర వ్యాధులకు పరీక్షలు చేయించుకుని మందులు సక్రమంగా వాడాలన్నారు. ఆరోగ్యశ్రీకి సంబంధించిన వివరాలను తెలుసుకుని వాటికి సంబంధించిన వైద్య సేవలు కూడా వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం 9వ తేదీన జరుగు నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పాలకొల్లు మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకర్‌రావు, ఉప సర్పంచి పివిఆర్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

అనుమతి లేని భూముల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు

ప్రజాశక్తి - ఆకివీడు

పట్టణ పరిధిలో వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చి, అనుమతి లేకుండా ప్లాట్లుగా విక్రయించొద్దని నగర పంచాయతీ కమిషనర్ కె.కృష్ణమోహన్ హెచ్చరించారు. కొందరు ఆ రకంగా అనుమతి పొందకుండా అక్రమంగా స్థలాలు విక్రయిస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆ రకమైన స్థలాలు కొని కొందరు భవన నిర్మాణాలు చేపడుతున్నారని, అనుమతులు లేని లేఅవుట్లలో నిర్మాణాలకు తాము ఎటువంటి అనుమతులు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. అటువంటి నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.3 లక్షలు

కాళ్ల: కాళ్లకూరులో వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అన్నదాన భవన నిర్మాణానికి దాతలు రూ.3 లక్షల విరాళం మంగళవారం అందజేశారు. నెల్లూరుకు చెందిన ఎస్‌ఎస్‌ఎల్ ఆక్వా అధినేత బండి సృజన్ కుమార్ రెడ్డి, శిరీష దంపతులు రూ.2,00,116 విరాళాన్ని ఆలయ ఇఒ మోకా అరుణ్ కుమార్‌కు అందజేశారు. సిద్ధాపురానికి చెందిన గొట్టుముక్కల. రామచంద్రరాజు - వెంకటలక్ష్మి దంపతులు రూ.1,00,116 విరాళాన్ని అన్నదాన భవన నిర్మాణం నిమిత్తం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎం.అరుణ్ కుమార్‌కు అందజేశారు.

విద్య, వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి చెప్పారు. స్థానిక వైసిపి కార్యాలయంలో 9 నుంచి 16వ వార్డు మహిళలకు మనసారా ఆసరాలో భాగంగా చీరలు పంపిణీ చేసి భోజనాలు పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జగన్ ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ పథకాలు నడవాలంటే తిరిగి 2 ఓట్లు జగన్‌కు వేయాలని కోరారు. ఒకటి తనకు, రెండోది గూడూరి ఉమాబాలకు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నేతలు చెల్లం ఆనంద ప్రకాష్, యడ్ల తాతాజీ, గుణ్ణం నాగబాబు, చందక సత్తిబాబు, నడపన గోవిందరాజులు, కర్రా జయ సరిత, పెచ్చెట్టి కృష్ణాజీ, ఉనికెల శ్రీను పాల్గొన్నారు.

8న చలో విజయవాడను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఆశా వర్కర్లకు కనీస వేతనం, గ్రూప్ ఇన్సూరెన్స్, సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సంక్షేమ పథకాలు అమలుకై ఈ నెల 8న జరిగే చలో విజయవాడను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక బ్యాంక్ కాలనీలోని పిహెచ్‌సి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో చలో విజయవాడ కరపత్రాల ఆవిష్కరణను ఆవిష్కరించారు. నిరసన తెలియజేసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడారు. ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలని, రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ కల్పించాలి. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గార రంగారావు, జి.వాణి, లలిత, లావణ్య, ఝన్సీ, కెఎన్.లక్ష్మి, రత్న కుమారి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

In the Court of the Ist Addl. Junior Civil Judge, Bhimavaram
O.S. No. 296/2023

వాది:
Saripidakala Ramakrishna

ప్రతివాది:
Meragani Appa Rao, S/o. Appa Rao, Flat No. S-3, Subhadra Residency, Srirampuram, Bhimavaram-2

పై నెంబరు దావాలో ప్రతివాదికి దావా సమన్లు అనేక పర్యాయములు శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టర్డ్ పోస్టు ద్వారాను పంపించినను సదరు ప్రతివాది ఉద్దేశ్య పూర్వకంగా అందుకొని యుండుటలేదు. కాబట్టి ప్రతివాదికి దావా సమన్లు అమలు నిమిత్తం **ది. 23-02-2024 సం॥ తేదీకి వాయిదా వేసినారు. సదరు తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

పిటిషనరు తరపు అడ్వకేటు
R.SRINIVASA MURTHY
భీమవరం Advocate, Bhimavaram
03-02-2024 Cell: 9948122644

In the Court of the Ist Addl. Junior Civil Judge, Bhimavaram
I.A. No. 316/2023 in O.S. No. 296/2023

పిటిషనరు/వాది:
Saripidakala Ramakrishna

రెస్పాండెంటు/ప్రతివాది:
Meragani Appa Rao, S/o. Appa Rao, Flat No. S-3, Subhadra Residency, Srirampuram, Bhimavaram-2

పై నెంబరు దావాలో I.A. No. 316/2023 (Or 38 R 5) నెంబరులో రెస్పాండెంటుకు నోటీసులు శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టర్డ్ పోస్టు ద్వారాను అనేక పర్యాయములు పంపించినను సదరు రెస్పాండెంటు ఉద్దేశ్యపూర్వకంగా అందుకొని యుండుటలేదు. కాబట్టి రెస్పాండెంటుకు నోటీసులు అమలు నిమిత్తం **ది. 23-02-2024 సం॥ తేదీకి వాయిదా వేసినారు. సదరు తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

పిటిషనరు తరపు అడ్వకేటు
R.SRINIVASA MURTHY
భీమవరం Advocate, Bhimavaram
03-02-2024 Cell: 9948122644

వేలం ప్రకటన
మహారాజశ్రీ భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి. నెం. 23/2022
ఒ.యస్. నెం. 83/2021

Between:
బీళ్ళ నారాయణరావు -డిక్రీ హోల్డర్/వాది
మరియు
1) ఇందుకూరి నాగలక్ష్మి
2) గాదంశెట్టి లక్ష్మికుమారి
-జేడిఆర్స్/ప్రతివాదులు

ఈ పై నెంబరు గల గ్రంథములో ఇ.పి. వారంటు బాకీ వసూలు నిమిత్తము జేడిఆర్స్ యొక్క దిగువ షెడ్యూల్ ఆస్తిని భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి వారు ది. 22-02-2024వ తేదీన ఉదయము 10.30 ని॥లకు భీమడోలు, జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు ఎదుట వేలము వేయుచున్నారు. వేలములో పాల్గొనువారు **ది. 22-02-2024వ తేదీన ఉదయము 10.30 ని॥లకు** సదరు వేలములో పాల్గొనవచ్చును. పూర్తి వివరములకు డిక్రీ హోల్డర్ ప్లీడర్ గారిని సంప్రదించవచ్చును.

షెడ్యూల్: పశ్చిమగోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, ఏలూరు సబ్ రిజిష్ట్రీ, గోపన్నపాలెం గ్రామము, దాఖలా ఆర్.ఎస్. నెం. 283/2, డోర్ నెం. 2-24, అసెస్మెంట్ నెం. 174, దాఖలా చ॥గ॥ 0-72 లు ఆర్.సి.సి. బిల్డింగ్‌నకు హద్దులు.
తూర్పు: రోడ్డు. **దక్షిణము:** ఏనుగు వెంకాయమ్మ గారి స్థలము. **పడమర:** జంగారెడ్డిగూడెం రోడ్డు. **ఉత్తరము:** ఏనుగు బలే రాములు గారి స్థలము.
డిక్రీ హోల్డర్ విలువ: రూ. 15,00,000/-
అమీనా విలువ: రూ. 20,00,000/-

జి.వి.రవికుమార్
ఏలూరు డి.హెచ్.ఆర్. అడ్వకేట్, భీమడోలు
07-02-2024 సెల్: 9440183345